క్లుప్తంగా

హ్యాక్తాన్ పోటీల విజేతలకు బహుమతులు



హేక్తాన్ పోటీల్లో విజేతలకు నమూనా చెక్‌ను అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: హ్యాక్తాన్ పోటీలు విద్యార్థుల్లో దాగివున్న వినూత్న ఆలోచనలు బయటికి తీసుకొచ్చేందుకు దోహదపతాయని స్థానిక ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతి రాజు అన్నారు. కళాశాలలో ప్రజ్వలన పేరిట 24 గంటల పాటు నిర్విరామంగా నిర్వహించిన హ్యాక్తాన్ పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతుల ప్రదానం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి 45 విద్యార్థి బృందాలు పాల్గొన్న ఈ పోటీల్లో భీమవరం విష్ణు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రథమ, ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదుతో పాటు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్‌రంగరాజు, అధ్యాపకులు వి.చంద్రశేఖర్, ఎన్ గోపాలకృష్ణమూర్తి, శిరీష, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

26న వెలివర్రులో నిప్పులగుండం



పేరంటాలమ్మ

ఉండి: ఉండి మండలం వెలివర్రు వీర పేరంటాలమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 26వ తేదీ రాత్రి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే నిప్పులగుండం తొక్కే కార్యక్రమం ఏర్పాటుచేశామని చైర్మన్ మంతెన రంగరాజు, ఆలయ మేనేజర్ రుద్రరాజు ఫణిరామకిశోర్, ముదునూరి కొండరాజు, కళ్లేపల్లి సతీష్‌రాజు తెలిపారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

వీరవాసరం: రాయకుదురులో మానసా దేవి గుడి వరకు ఉన్న మార్గాన్ని సీసీ రోడ్డుగా సుమారు నాలుగు లక్షలు మండల పరిషత్ నిధులతో నిర్మిస్తున్నారు. ఈ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గద్దం భారతి, వైస్‌ఎంపీపీ అడ్డాల శ్రీరామ్ చంద్రమూర్తి, గుబ్బల సత్యానారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాధిక్, మల్లుల నర్సమ్మ, చింతపల్లి పండు, దుర్గా ప్రసాద్, వార్డు సభ్యులు గుడి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఆర్‌జెడ్ భూముల్లో ఆక్రమణ స్థలాల పరిశీలన

మొగల్తూరు: సీఆర్‌జెడ్ భూముల్లో అక్రమ కట్టడాలు నిర్మించుకున్న స్థలాలను శుక్రవారం కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరిశీలించారు. ఉమ్మడి జిల్లాల కాలుష్య నియంత్రణ మండలికి చెందిన ఈఈ కేవీ రావు, ఏఈఈ రమేష్‌లు తీరంలోని సీఆర్‌జెడ్ భూముల్లో అనుమతి లేకుండా నిర్మించుకున్న అక్రమ కట్టడాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. 2011 సీఆర్‌జెడ్ చట్టానికి వ్యతిరేకంగా నిర్మించుకోవడంతో గతేడాది రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడాలు తొలగించిన విషయాన్ని తహసీల్దార్ అనిత కుమారి అధికారులకు వివరించారు. అనుమతి లేకుండా అక్రమ కట్టడాలు నిర్మిస్తే తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వీరి వెంట ఎంపీడీఓ ఆర్‌సీ ఆనంద్ కుమార్, వీఆర్వో కావ్య తదితరులున్నారు.

వైభవంగా మత్స్యనారాయణ స్వామి జయంతి

మొగల్తూరు: పేరుపాలెం కనకదుర్గమ్మ బీచ్‌లో ఉన్న మత్స్యనారాయణస్వామి జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి విఖానస స్తోత్ర పారాయణ, స్వస్తి వచనం, విష్వక్సేన పూజా, కలసారాధనలు,పుణ్యాహవచనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 108 సార్లు మత్స్య గాయత్రీ మంత్రాన్ని పఠించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో గ్రామానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

పెనుగొండ: జాతీయ గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమంలో భాగంగా పెనుగొండ మండలంలో 25 నుంచి 31 వరకూ పశువులకు టీకాలు వేస్తామని పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ ప్రమీలా రాణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పాడి రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



కొత్తపూసలమర్రులో పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్ : అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలం కొత్తపూసలమర్రు గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ కార్యాలయానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధితోపాటు సంక్షేమ పాలన సాగిస్తున్నారని వివరించారు. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ఎనిమిది మంది వివిధ శాఖల సిబ్బందిని నియమించి, ప్రతి 50 కుటుంబాలకు వలంటీర్‌ను పెట్టి అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని చెప్పారు. వైఎస్ జగన్ పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను తెలుసుకుని నవరత్నాలను రూపొందించి అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో 98.5 హామీలు నెరవేర్చారని వివరించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు రూ.22 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు చేపడుతున్నామన్నారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేయడమే కాకుండా ఫ్యామిలీ డాక్టర్ ద్వారా మెరుగైన వైద్యాన్ని ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించేందుకు 100 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు వేగంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో 600 హామీలిచ్చి అధికారం చేపట్టాక ఏ ఒక్క హామీని నెరవేర్చకపోవడంతో 2019లో 23 సీట్లకే పరిమితమయ్యారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ సభ్యులు కాండ్రేగుల నరసింహరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, సర్పంచ్ జల్లా కొండయ్య, ఎంపీటీసీ సభ్యులు తిరుమాని తులసీరావు, తహసీల్దార్ వై.రవికుమార్, ఎంపీడీఓ రామచంద్రప్రభు, పంచాయతీ రాజ్‌శాఖ డీఈ జి.స్వామినాయుడు, నాయకులు బర్రె నాగరాజు, బస్వాని సుబ్రహ్మణ్యం, బొమ్మిడి వీర్రాజు, కొల్లాటి వీరయ్య, బస్వాని సుబ్రహ్మణ్యం, తిరుమాని కిరణ్, వెంకటేశ్వర్లు, జల్లా గోవిందు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సాక్షి, భీమవరం: గ్రామాల్లో సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. యనమదుర్రు గ్రామానికి చెందిన పార్టీ శ్రేణులు శుక్రవారం రాత్రి ఎమ్మెల్యేను తన క్యాంపు కార్యాలయంలో కలిశారు. గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బూరాబత్తుల రామ్మూర్తి, తిరుమల విజయ రామ్, చందు నాని, బద్దా శాంతారామ్, పనసకర్ల మురళీకృష్ణ, పుట్ల ప్రశాంత్ కుమార్, బొద్దుల యాకోబ్, తాళ్లూరి భాస్కరరావు, కొరగంటి ప్రశాంత్, కారేపల్లి జాన్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు దుస్తుల పంపిణీ



ఆటో డ్రైవర్స్‌కు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: మున్సిపల్ మాజీ చైర్మన్, దివంత వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గ్రంధి వెంకటేశ్వరరావు జయంతి వేడుక శుక్రవారం వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. వెంకటేశ్వరరావు చిత్రపటానికి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, రవితేజ పూలమాలలువేసి నివాళులర్పించారు. కేకు కట్ చేసి, ఆటో డ్రైవర్లకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నర్సింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నర్సింహారావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్‌రాజు, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమా బాల, పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రిస్టియన్లను ఎస్సీల్లో చేర్చే తీర్మానం హర్షణీయం

ఆకివీడు: దళిత క్రిస్టియన్లను ఎస్సీల్లో చేర్చాలంటూ అసెంబ్లీలో తీర్మానం ఆమోదించడం పట్ల అఖిల భారత క్రిస్టియన్ ఫెడరేషన్ ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రాజ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రత్నకుమార్ (రవి) శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. గత 26 ఏళ్ల నుంచి దళిత క్రిస్టియన్లను ఎస్సీ జాబితాలో చేర్చాలని చేసిన పోరాటాల ఫలితంగా సీఎం జగన్ చేసిన తీర్మానం దళితజాతి అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు. మతం మారినా కులం మారదని, కులం సామాజిక అంశమని, మతం ఆధ్యాత్మిక అంశమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి దళితుల్ని ఎస్సీల జాబితాలో చేర్చే విధంగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.బెన్‌హర్, జిల్లా అధ్యక్షుడు బి.సుందర్‌దాసు, నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్.యాకోబ్, మండల అధ్యక్షుడు పి.ఎలీషా, వై.ఏసు, జి.యేసోబు, ప్రసంగిరావు, చొప్పల వెంకటేష్, జిల్లా లీగల్ అడ్వయిజర్ రాపాక సత్తిబాబు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

సాక్షి, భీమవరం: భగత్‌సింగ్ వర్ధంతి సభ స్థానిక చినరంగనిపాలెంలో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పార్టీ నాయకులు అన్నం రాంబాబు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, కొమరగిరి కుమార్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ పట్టణ నాయకుడు ఎం వైకుంఠరావు, చైతన్య ప్రసాద్, సాయమ్మ, సోమేశ్వరరావు, మరియమ్మ, యోహానుబాడ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జయలక్ష్మి

ఆకివీడు: బాల్య వివాహాల్ని అరికట్టేందుకు కృషి చేయాలని ఎంపీపీ కఠారి జయలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. చిన్న పిల్లలకు వివాహం చేయడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. మండల పరిషత్ సమావేశాలకు మండల స్థాయి అధికారులు పలువురు గైర్హాజరవడాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి మళ్లీ తీసుకెళతామన్నారు. వేసవి దృష్ట్యా మంచినీటి చెరువుల్ని పూర్తిస్థాయిలో నింపుకునేందుకు కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ పనులు, జల జీవన్‌మిషన్ పనులు త్వరితగతిని ప్రారంభించాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పార్వతి మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి గ్రామానికీ రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు నిధులు వచ్చాయని, పైప్‌లైన్ల విస్తరణ, రక్షిత నీటి పథకాలు, సంప్‌లు, ఫిల్టర్ బెడ్‌ల నిర్మాణం వంటి పనులు చేయిస్తామని చెప్పారు. ప్రజలకు ఉచితంగా పైప్ కనెక్షన్లు ఇచ్చేందుకు కూడా మెటీరియల్ అందుబాటులో ఉందన్నారు. ఎఫ్‌డీఓ వివేక్ మాట్లాడుతూ సుమారు 460 ఎకరాల చెరువుల్ని ఆక్వా జోన్‌లోకి మార్పించేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. బాల్య వివాహాలు అరికట్టేందుకు సహకరించాలని సీడీపీఓ కార్యలయ సూపర్‌వైజర్ రత్నకుమారి కోరారు. సచివాలయ భవన నిర్మాణాల్ని త్వరితగతిని పూర్తి చేయాలని పంచాయతీరాజ్ జేఈ రమణమ్మ అన్నారు. ప్రతి గ్రామంలో రెండు మూడు, పట్టణ కేంద్రంలో 10కి పైగా ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయని లైన్ ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు. గ్రామాల్లోకి అధికారులు వచ్చినప్పుడు ఎంపీటీసీలకు తెలియజేయడం లేదని వైస్‌ఎంపీపీ సైదాల సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలు కూడా చెప్పడంలేదన్నారు. విద్యుత్ సమస్యలపై అధికారులు చర్యలు తీసుకోవడంలేదని చెరుకుమిల్లి సర్పంచ్ నందమూరి ప్రకాశం ఆరోపించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రాజ్ కిషోర్, ఎంఈఓ రవీంద్ర, సర్పంచ్‌లు గురువెల్లి అన్నపూర్ణ, ప్రసాద రాజు, కోట అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తుందుర్రులో క్షయపై అవగాహన



తుందుర్రులో క్షయపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ఎస్.అరుణ కుమారి అన్నారు. భీమవరం మండలం తుందుర్రులో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా శుక్రవారం క్షయపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ అరుణకుమారి మాట్లాడుతూ రెండు వారాల పైబడి దగ్గు, జ్వరం, ఛాతి నొప్పి, దగ్గినప్పుడు కఫం పడిన లక్షణాలు ఉంటే వెంటనే ఉమ్మి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. అశ్రద్ధ చేస్తే ప్రాణాపాయం స్థితికి చేర్చుతుందని పేర్కొన్నారు. ర్యాలీ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సుగుణరాజు, పీహెచ్‌ఎన్ వై.రాజకుమారి, సూపర్ వైజర్లు ఎం.సాయికుమార్, తాతారావు, సీహెచ్ పెద్దీశ్వరి, బి.మంగాదేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షయ పట్ల అప్రమత్తంగా ఉండాలి

కాళ్ల: క్షయ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కాళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గులాబ్ రాజ్ కుమార్ అన్నారు. శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా కాళ్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ రెండు వారాల మించి కఫంతో కూడిన దగ్గు ఉన్నట్లయితే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి కళ్లె పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయ బాధితులు ప్రభుత్వం డీవోటీ విధానంలో అందించే మందులు వాడితే విముక్తి పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ విజయావతి, ఎంపీహెచ్‌ఈఓ పాల్సన్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొడమంచిలి అభివృద్ధికి ప్రణాళిక

పెనుగొండ: కొడమంచిలి గ్రామాభివృద్ధికి మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో ప్రణాళిక రూపొందించడంతో పాటు, పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం అన్నారు. శుక్రవారం కొడమంచిలి పంచాయతీలో పాలకవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. బీపీ చెరువులో సీసీ రోడ్డు నిర్మాణం, చినపేటలో అమృత్ సరోవర్ పథకంలో భాగంగా మంచినీటి చెరువును బాగు చేసేందుకు తీర్మానం చేసినట్లు తెలిపారు. మట్టి మోరంలో భాగంగా పుంత రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదనలు, అరుంధతీ పేట తీర్థాల పుంతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నట్లు, కామాక్షీ దేవాలయం పక్కన రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. సమావేశంలో కార్యదర్శి షేక్ హీనాభాను, ఉప సర్పంచ్ ములగాడ వరప్రసాద్, సభ్యులు చిలుకూరి శ్రీనివాస్, బొంతా సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు - భూ రక్ష పథకం ప్రారంభం

వీరవాసరం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకం వీరవాసరం రెవెన్యూ పరిధిలోని పెర్కిపాలెం, బాలేపల్లి, వడ్డీగూడెం, నందమూరు గురువు, దూసనపూడి, మత్స్యపురిపాలెం, మెంటేపూడి గ్రామాల్లో శుక్రవారం గ్రామ పెద్ద, సర్పంచ్‌లు, ఎంపీటీసీల సమక్షంలో ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వీరవాసరం పట్టణాధ్యక్షుడు నూకల కనకరావు మాట్లాడుతూ సమగ్ర భూ సర్వే ద్వారా సివిల్ వివాదాలకు, లంచాలకు, కబ్జాలకు తావు ఉండదని చెప్పారు. వీరవాసరం సర్పంచ్ చికిలే మంగతాయారు మాట్లాడుతూ వందేళ్ల తర్వాత భూముల రీసర్వే చరిత్ర లిఖిస్తున్నట్లేనని తెలిపారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

భీమవరం అర్బన్: పశువులకు గాలి కుంటు వ్యాధి సోకకుండా శనివారం నుంచి ఏప్రియల్ 24 వరకు టీకాలు వేయనున్నట్టు మండల పశు వైద్యాధికారి పి.పుండరీబాబు తెలిపారు. మండలంలోని 25 గ్రామాల్లో మూడు నెలలు పైబడిన ఆవులు, గేదెలకు పశు పెంపకందారుని ఇంటివద్దకెళ్లి ఉదయం నుంచి పశు వైద్య సిబ్బంది పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తారని చెప్పారు. వెంప గ్రామంలో శనివారం ఉదయం పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు వేయనున్నట్టు తెలిపారు.

రేపు కలవపూడి సొసైటీ మహాజనసభ

కాళ్ల: కలవపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మహాజన సభ ఆదివారం ఉదయం నిర్వహించనున్నట్టు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ పెనుమత్స దుర్గ ప్రసాద్ రాజు, సీఈఓ కనుమూరి నరసింహారాజు తెలిపారు. కలవపూడి పంచాయతీ పరిధిలోని మోడి గ్రామంలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించే మహాజన సభకు సంఘ సభ్యులు, రైతులు అందరూ హాజరు కావాలని కోరారు.

అవకతవకలపై విచారణ

పాలకోడేరు: పాలకోడేరులో గ్రామ సంఘం నిల్వ నిధుల్లో అవకతవకలపై శుక్రవారం మరోమారు ఏపీఎం యు.రవికుమార్ విచారణ చేశారు. అవకతవకలకు సంబంధించిన విచారణకు కొన్ని స్వయం సహాయక సంఘాల బృందాలు మాత్రమే హాజరు కావడంతో విచారణ ఆలస్యంగా సాగుతుంది. నిధులు స్వాహా చేసిన వీవోఏ ఆరు నెలలలోగా ఆ మొత్తాన్ని చెల్లించాలని అధికారులు గడువు ఇచ్చారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వీవోఏ భవాని మాట్లాడుతూ దీనికి తాను పూర్తి స్థాయిలో బాధ్యురాలిని కాదని వెల్లడించారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన



జక్కరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల : ఘన వ్యర్థాల నిర్వహణలో పంచాయతీలు ప్రత్యేక పాత్ర పోషించాలని జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటర్ ప్రతినిధి కె.విశ్వనాథం అన్నారు. కాళ్లమండలం జక్కరం గ్రామంలోని జగనన్న స్వచ్ఛ సంకల్పం శిక్షణ కార్యక్రమం శుక్రవారం గ్రామంలోని డంపింగ్ యార్డ్ వద్ద గ్రామ సర్పంచ్ కూచంపూడి పద్మావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేరుచేసి సంపదను సృష్టించే మార్గాలను వివరించారు. పైలెట్ విలేజ్‌గా ఎంపికైన జక్కరం గ్రామంలో డంపింగ్ యార్డును సుందరంగా ముస్తాబు చేశారని, ప్రతి గ్రామంలో ఇదే తరహా వాతావరణం కల్పించాలని సూచించారు. గ్రామంలో అభివృద్ధికి సర్పంచ్ పద్మావతి, పంచాయతీ పాలకవర్గం, సచివాలయ సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఉప సర్పంచ్ కూచంపూడి లక్ష్మీపతి రాజు మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈవోపీఆర్డీ భాస్కర్ పలు సూచనలు చేశారు. మొగల్తూరు మండలం రామన్నపాలెం, కొత్తట, భీమవరం మండలం శ్రీరాంపురం, గొల్లవానితిప్ప, కాళ్ల మండలం బొండాడ, జక్కరం గ్రామాల వారికి శిక్షణ ఇచ్చారు. రెండు రోజులపాటు ఈ శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. గ్రామ కార్యదర్శి జమాల్, కాళ్ల, భీమవరం, మొగల్తూరు మండలాల్లో సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఆరోగ్య కార్యకర్తలు పంచాయతీ సర్పంచ్ పద్మవతి ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు.

మంచినీటి ఎద్దడి రాకుండా చర్యలు



మంచినీటి చెరువులో నీటిని నింపే కార్యక్రమాన్ని ప్రారంభించిన డీసీసీబీ చైర్మన్ నర్సింహరాజు

ఆకివీడు: నియోజకవర్గంలో మంచినీటి సమస్య తలెత్తకుండా గ్రామాల్లోని మంచినీటి చెరువులన్నింటినీ నీటితో నింపేందుకు చర్యలు చేపట్టాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సూచించారు. ఆకివీడు మండలం గుమ్ములూరు గ్రామంలో మంచినీటి చెరువులో పూడిక తీత పనులు పూర్తయిన సందర్భంగా మంచినీటిని నింపేందుకు శుక్రవారం ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గోదావరిలో నీటి మట్టం తక్కువగా ఉందని, రబీ సాగుకు వంతుల వారీ నీటిని విజయవంతంగా సరఫరా చేస్తున్నారని పీవీఎల్ తెలిపారు. చెరువుల్లో నీటిని నింపుకునేందుకు జిల్లా నీటి యంత్రాంగం ఒక వారం వంతు నీరు సరఫరా చేయనుందని చెప్పారు. సర్పంచ్ అనంత లక్ష్మీ మాట్లాడుతూ ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా రక్షిత మంచినీటి పథకానికి మరమ్మతులు పూర్తి చేయించామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా దళిత పేటల్లో డ్రెయినేజీ, సీసీ రహదారి సౌకర్యం కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళి, జి.ధనరాజు, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు కోట చిన్నా, వానపల్లి భాస్కరరావు, కత్తుల శ్రీను, చిక్కాల చిన్నా, నాతిరెడ్డి అన్నవరం, అన్యెం శ్రీనివాసరావు, పోశిం నర్సింహారావు, యడ్లపల్లి తాతాజీ, యాళ్లబండి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈనిక సమయంలో పిచికారీ వద్దు

యలమంచిలి: వరి పైరు ఈనిక దశలో ఉన్న సమయంలో పురుగుమందులు, తెగుళ్ల మందులు పిచికారి చేయవద్దని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు చింతల శ్రీనివాసరావు కోరారు. మట్లపాలెం గ్రామంలో శుక్రవారం జరిగిన వైఎస్సార్ పొలం బడి కార్యక్రమంలో ఆయన ఆధ్వర్యంలో ఏలూరు నుంచి వ్యవసాయ అధికారులు వచ్చి రైతులకు వరిసాగులో మెళకువలు, సలహాలు, సూచనలు ఇచ్చారు. జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు జి.రామలింగేశ్వరరావు మాట్లాడుతూ పురుగుమందులు పిచికారీ చేయాల్సి వస్తే ఉదయం సమయంలో అసలు చేయవద్దు అన్నారు. ఆ సమయంలో వరి కంకులు (ఫలదీకరణ) పాలు పోసుకుంటూ ఉంటాయన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట తరువాత పిచికారీ చేయాలని సూచించారు. పొలంలోనికి వెళ్లి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్ర వ్యసాయాధికారి కె కాశీమాత నరసాపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈద అనిలకుమారి, మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి, గ్రామ వ్యవసాయ సహాయకులు కల్యాణ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్యం అందరి బాధ్యత

జిల్లా కలెక్టర్ ప్రశాంతి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

పాలకోడేరు: ఇంటి పరిసరాలు వలే గ్రామాన్ని కూడా పరిశుభ్రంగా చూసుకోవాలని, సంపూర్ణ పారిశుధ్యం అందరి బాధ్యతని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. విస్సాకోడేరులో సర్పంచ్ బొల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ (ఎస్‌డబ్ల్యూపీసీ) కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. గాంధీజీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ ప్రశాంతి, సర్పంచ్ శ్రీనివాస్ పులమాలేసి నివాళులర్పించారు. సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. సంపద తయారీ కేంద్రాన్ని, నిర్వహణ పద్ధతులు, చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సర్పంచ్ శ్రీనివాస్‌ను అభినందించారు. శిక్షణ నిమిత్తం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రానికి వచ్చిన యలమంచిలి మండలం సింగరాయపాలెం, కలగంపూడి, పాలకొల్లు మండలం దగ్గులూరు, లంకలకోడేరు, పాలకోడేరు మండలం విస్సాకోడేరు, గొరుగునమూడి గ్రామాల నుంచి వచ్చిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, డీపీఆర్‌సీ సిబ్బందికి ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమానికి సర్పంచ్ బొల్లా శ్రీనివాస్ అధ్యక్షత వహించి మాట్లాడారు. గతంలో గ్రామంలో డంపింగ్ షెడ్ లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని చెప్పారు. పాలకవర్గం సభ్యులు, గ్రామస్తులు అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకారంతో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. సంపూర్ణ పారిశుధ్య గ్రామంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో మూడు చోట్ల సంపద తయారీ కేంద్రాలను పరిశీలించినట్టు తెలిపారు. ఈ ప్రాంతాల్లో సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. విస్సాకోడేరు గ్రామంలో సర్పంచ్ శ్రీనివాస్ ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని నెలకొల్పడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కందుల నాగరాజు, కో ఆప్షన్ సభ్యులు డాక్టర్ స్వర్ణలత, ఎంపీటీసీ సభ్యులు బొల్లం గాంధీ, లక్ష్మీపతి, జిల్లా పంచాయతీ అధికారి నాగలత, మండల ప్రత్యేక అధికారి రమణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మురళీ గంగాధర్, ఇన్‌చార్జి డీఎల్‌పీఓ రెడ్డియ్య, డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ శివ ప్రసాద్, డీపీఆర్‌సీపీటీసీ ఎడ్వర్డ్, పంచాయతీ కార్యదర్శి చార్జి ప్రసాద్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.